క్లుప్తంగా

కళాతపస్వికి నివాళి



మాట్లాడుతున్న తులసీనాథం నాయుడు

పలమనేరు: తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలను చిత్ర పరిశ్రమ ద్వారా విశ్వవ్యాప్తం చేసిన కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సభ్యులు పట్టణ సమీపంలోని కళామందిరంలో శుక్రవారం నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కె.విశ్వనాథ్ తన చిత్రాల ద్వారా సమాజానికి ఎన్నో విలువలు నేర్పించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో తులసీనాథం నాయుడు, పుష్ప, నరేంద్ర, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా వీరభద్ర



శాంతిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా 64 పెద్దూరు పంచాయతీ సోమాపురానికి చెందిన వీరభద్ర నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ శుక్రవారం నియామక ఉత్తర్వులను జారీ చేశారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన పార్టీ పెద్దలకు వీరభద్ర కృతజ్ఞతలు అన్నారు. పార్టీ పటిష్టతకు, బీసీల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

రామకుప్పం ఎస్‌ఐగా కృష్ణయ్య



రామకుప్పం: మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బి.కృష్ణయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న ఉమామహేశ్వర్ రెడ్డి చిత్తూరు వీఆర్‌కు వెళ్లారు. వీఆర్‌లో ఉన్న కృష్ణయ్య బదిలీపై రామకుప్పం ఎస్‌ఐగా వచ్చారు.

తిరునాళ్లు ప్రారంభం



సదుం: మండలంలోని జంగంపల్లె కాశీవిశ్వేర స్వామి ఆలయంలో శుక్రవారం తిరునాళ్లు ప్రారంభం అయ్యాయి. ఆలయంలో ధ్వజారోహణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఆలయాన్ని దర్శించారు. శనివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

సోమల: మండలంలోని కందూరులో కన్యకా పరమేశ్వరి ఆలయంలో కుంభాభిషేకం నిర్వహించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 108 కలశాలతో పాలాభిషేకం నిర్వహించారు. ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా కాశీయాత్ర ఉత్సవం

వి.కోట: పట్టణంలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల విశ్వబ్రాహ్మణ సంఘం వారి ఆధ్వర్యంలో కాశీయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం పల్లకిపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు.

నేడు మసెమ్మ జాతర

పుంగనూరు: మండలంలోని ఆరడిగుంట పంచాయతీ కొండచెర్ల కురప్పల్లె గ్రామంలో శనివారం మసెమ్మ జాతర ఘనంగా ప్రారంభం కానుంది. రెండురోజుల పాటు జరిగే జాతరలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. సుమారు 30 గ్రామాల నుంచి భక్తులు విచ్చేయనున్నారు. శనివారం రాత్రి అమ్మవారిని ఊరేగిస్తారు. ఆదివారం ఉదయం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తారు. జాతర సందర్భంగా సీఐ గంగిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహాసభలను జయప్రదం చేయండి

పలమనేరు: ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరిగే ఐఎఎఫ్‌టీయూ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరికృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద సంఘ నాయకురాలు జ్యోతి అధ్యక్షతన శుక్రవారం సభ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి దేశంలోని 30 రాష్ట్రాల ప్రతినిధులు హాజరుకానున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేఖ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

సోమల: కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ మారుతి తెలిపారు. వివరాలు.. శుక్రవారం కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బూరగమాను కాలనీ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. చౌడేపల్లె నుంచి వచ్చిన బైకులో కర్ణాటక మద్యం తరలిస్తున్న వడ్డిపల్లెకు చెందిన రామచంద్రను అరెస్ట్ చేసి, అతని వద్ద 70 క్వార్టర్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి పుంగనూరు కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ పాలన

- ఎన్నికల హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే
- పార్టీలకు అతీతంగా పేదలకు సంక్షేమ పథకాలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



రొంపిచెర్ల: గానుగచింతలో వాటర్ ప్లాంట్లును ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి



రొంపిచెర్ల : మంత్రి పెద్దిరెడ్డికి హారతి ఇస్తున్న మహిళలు

రొంపిచెర్ల: ఎన్నికల హామీల అమలులో దేశంలో ఏ ముఖ్యమంత్రి ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పోటీ పడలేరని అటవీ, విద్యుత్, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లా, పుంగనూరు నియోజకవర్గం రొంపిచెర్ల మండలంలో శుక్రవారం ఆయన పల్లెబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్ 95 శాతానికిపైగా అమలు చేశారని తెలిపారు. ఎన్నికల హామీల అమలులో దేశంలోనే ఏ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో పోటీ పడలేరని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఐదేళ్లు పూర్తయినా అమలు చేయని ముఖ్యమంత్రులను చూశామని, వైఎస్ జగన్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన మొదటి సంవత్సరం నుంచే అన్ని హామీలను అమలు చేశారని కొనియాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాలన పారదర్శకంగా జరుగుతోందని తెలిపారు. గత చంద్రబాబు హయాంలో లాగా పెన్షన్ల కోసం క్యూలైన్లు లేవని, పథకాల మంజూరుకు జన్మభూమి కమిటీలు కూడా లేవన్నారు. కేవలం అర్హతను కొలమానంగా తీసుకుని పార్టీలకు అతీతంగా పథకాలను అందిస్తున్నామని తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేసి, ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. రానున్న రోజుల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. అచ్చార్ల చెరువు నుంచి మండలంలోని అన్ని చెరువులకు కాలువల ద్వారా నీరు మళ్లిస్తున్నామని తెలిపారు. మండలంలో రోడ్లు, ప్రభుత్వ భవనాలను అధిక శాతం నిర్మించామని, పల్లెబాటలో ఎలాంటి సమస్యలు లేవని మహిళలు చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల అండదండలతో 2024లో కూడా సీఎం జగన్ అధిక మెజారిటీ సీట్లతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ హరినాథరెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవులపల్లె వెంకటరమణారెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, సలీంబాషా, మండల కన్వీనర్ చెంచురెడ్డి, ఇబ్రహీంఖాన్, మదనమోహన్‌రెడ్డి, ఏపీపీ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దిమాకులపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని నడమంత్రం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 198 గృహాలకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి వచ్చిన సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించేలా అధికారులను ఆదేశించారు. గ్రామంలో నెలకొన్న చిన్నపాటి సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ సమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.

సచివాలయాల ద్వారా సమస్యల పరిష్కారం

సచివాలయాల ద్వారా రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన కొనసాగుతోందని, ప్రజలు ఎలాంటి సమస్యలు తెలిపినా వెంటనే పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే తమ పరిధిలోని గ్రామ సచివాలయాల్లో ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తారని ప్రజలకు సూచించారు. వలంటీర్ల ద్వారా ప్రతి నెలా 1వ తేదీ వచ్చిందంటే అవ్వ,తాతలకు పింఛన్‌ను ఇళ్ల వద్దే అందిస్తున్నట్లు తెలిపారు.

డప్పు కొట్టి చెప్పుకునే తత్వం చంద్రబాబుది..

2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే వాటిని గాలికొదిలేశారని ఎమ్మెల్యే ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఏ పథకాలు అయినా సరే టీడీపీ నాయకుల అనుచరులు, సానుభూతిపరులకే అందేవని, అన్ని అర్హతలు ఉన్నా కూడా సామాన్య ప్రజలకు అందేవి కావని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారులు, వలంటీర్లు అర్హులను వెతుక్కుంటూ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

రైతులంతా సంతృప్తిగా ఉన్నారు..

జగనన్న ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రైతులు సంతృప్తికరంగా ఉన్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో అన్ని చెరువులకు నీళ్లు రావడంతో భూగర్భజలాలు పెరిగాయన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నన్ని రోజులు రాష్ట్రంలో కరువుకాటకాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ జగనన్న సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఒక్క స్థానం కూడా రాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ లక్ష్మణ్ రెడ్డి, నాయకులు ఆంజనేయులు, అక్మల్, సర్పంచ్ దామోదరం, ప్రభాకర్, పంచాయతీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

13 నుంచి శివరాత్రి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీఅగస్తీశ్వరస్వామి

పుంగనూరు: మండలంలోని నెక్కుంది గ్రామంలో వెలసిన శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. ఆలయంలో 10 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు 13న ప్రారంభమై 22 వరకు జరుగుతాయన్నారు. 18న శివరాత్రి పర్వదినాన ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. అలాగే 20న రథోత్సవం, 22న మహాకుంభాభిషేకం, ధ్వజారోహణం కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

నాణ్యమైన విద్య అందించండి

పులిచెర్ల(కల్లూరు): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ గుణశేఖరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మాణంలో ఉన్న రెండవదశ నాడు–నేడు పనులను పరిశీలించారు. అనంతరం పదవతరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. మొదటి సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షల్లో విద్యార్థుల ప్రగతిపై సమీక్షించారు. చివరి గ్రేడ్ పొందిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి త్వరలో జరిగే పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా చూడాలన్నారు. హెచ్‌ఎం తాతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొడుకు హింసిస్తున్నాడని ..

పలమనేరు: ఆస్తి కోసం కొడుకు తరచూ హింసిస్తున్నాడని తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పలమనేరు పట్టణంలో శుక్రవారం వెలుగు చూసింది. పట్టణంలోని ఎద్దుల సంతవీధిలో నివాసం ఉండే వహీదా(50ను కొడుకు లాయర్ షరీఫ్ ఆస్తి విషయంలో ఇబ్బంది పెడుతున్నాడని ఆమె వాపోయింది. దీంతోనే తాను చనిపోవాలని నిర్ణయించుకున్నానని, తనకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకుంది. దీనిపై స్థానిక పోలీసులు విచారిస్తున్నారు.

పాఠశాలలో తనిఖీ

పెద్దపంజాణి: మండలంలోని అమ్మరాజుపల్లి పంచాయతీ కురప్పల్లి మండల పరిషత్ పాఠశాలను శుక్రవారం ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప తనిఖీ చేశారు. స్కూల్ ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట చామనేరు పంచాయతీ వైస్ సర్పంచ్ రాజారెడ్డి పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌గా వెంకటరమణ గెలుపు



వెంకటరమణను సత్కరిస్తున్న నాయకులు

శాంతిపురం: రాళ్లబూదగూరు మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్‌గా పంచాయతీ 8వ వార్డు సభ్యుడు గాజుల వెంకటరమణ ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ ఎంపిక కోసం స్టేజ్–2 రిటర్నింగ్ అధికారి అప్పోజి శుక్రవారం రాళ్లబూదుగూరు గ్రామ సచివాలయంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. టీడీపీ మద్దతుతో ఉప సర్పంచు కోసం బరిలో నిలిచిన ఎస్‌ఏ వాజిద్‌కు 5 ఓట్లు రాగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడైన గాజుల వెంకటరమణకు 7 ఓట్లు వచ్చాయి. మరో వార్డు మెంబర్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నాడు. దీంతో రెండు ఓట్ల ఆధిక్యంతో వెంకటరమణ విజయం సాధించారు. ఇక్కడ ఉప సర్పంచుగా ఉన్న బి.నిసార్ మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా ఎంపిక కావడంతో ఆ పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా గెలుపొందిన వెంకటరమణను ఎంపీపీ వసుంధర, జెడ్పీటీసీ శ్రీనివాసులు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బుల్లెట్ దండపాణి, స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ రమేష్, కోఆప్షన్ సభ్యుడు నిసార్ అభినందించారు. అలాగే సర్పంచ్ లక్ష్మీదేవిని నాయకులు ప్రశంసించారు.

పార్టీ గెలుపునకు సైనికుల్లా పని చేయండి

- మునుపెన్నడూ లేని అభివృద్ధిని మనం ఇప్పుడు చూస్తున్నాం
- జీఓను జియో అని పలికే వ్యక్తి రాష్ట్రాన్ని ఉద్ధరిస్తాడా..!
- గృహ సారథుల సమావేశంలో జింకా వెంకటాచలపతి



మాట్లాడుతున్న పార్టీ పరిశీలకులు జింకా వెంకటాచలపతి, పక్కన ఇతర నేతలు



పుంగనూరు : సమావేశంలో ప్రసంగిస్తున్న చైర్మన్ అలీమ్‌బాష

సోమల: పార్టీ పటిష్టత కోసం గ్రామ సారథులు సైనికుల్లా పనిచేయాలని పుంగనూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు జింకా వెంకటాచలపతి అన్నారు. శుక్రవారం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, ఎంపీపీ ఈశ్వరయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గంగాధరం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా సీసీ రోడ్లు, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ సెంటర్ దర్శనమిస్తాయని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలు పుంగనూరు నియోజకవర్గంలో జరుగుతున్నాయని గుర్తు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత మన ప్రభుత్వానిదే అన్నారు. సచివాలయ పరిధిలో గృహసారథులు తమకు కేటాయించిన 50 గృహాలను తరుచూ సందర్శిస్తూ ప్రభుత్వ పథకాలను వివరించాలని తెలిపారు. గ్రామ గృహ సారథులకు తగిన గుర్తింపు ఉంటుందని, పార్టీ కోసం పనిచేసే వారికి బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించే బాధ్యత గృహ సారథులు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు,మండల సచివాలయ కన్వీనర్ రాశెట్టి మంజునాథ, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్‌బాషా, సర్పంచ్ రాజేశ్వరి, నాయకులు వెంకటరమణ, భాస్కర్, ఝాన్సీలక్ష్మీ, సరస్వతమ్మ పాల్గొన్నారు.

లోకేష్ రాష్ట్రాన్ని ఉద్ధరిస్తాడా..?

ప్రభుత్వ జీవోను జియో అని పలికే నారా లోకేష్ యువగళం పేరిట చేస్తున్న పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను తీరుస్తాననడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ముందు తెలుగు స్పష్టంగా మాట్లాడాలని హితవు పలికారు. మీ తండ్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడానికి 2014 ఎన్నికల్లో 600 హామీలను ప్రకటించి ప్రజలను నట్టేటముంచారని ప్రశ్నించారు. మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అసెంబ్లీలో పోరాడితే సమస్యలు పరిష్కారం కావని, ప్రజల మధ్యకు తన పాదయాత్ర ద్వారా వెళ్లి ముఖ్యమంత్రి అయిన వెంటనే ఇచ్చిన హామీలను మొదటి మూడేళ్లలోనే 95 శాతం నేరవేర్చారని అన్నారు.

పార్టీ పటిష్టత కోసం గ్రామ సారథులు ..

పుంగనూరు: గ్రామసారథులతోనే వైఎస్సార్‌సీపీని పటిష్టం చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా అన్నారు. శుక్రవారం ఆయన గృహసారథులతో పరిచయ కార్యక్రమాన్ని పలు సచివాలయాల్లో నిర్వహించారు. నూతన కన్వీనర్ వరదారెడ్డిని పరిచయం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు గ్రామసారథులు ఎంపిక చేయడం జరిగిందన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. సమావేశాల్లో వైస్ చైర్మన్లు లలిత, నాగేంద్ర, కొండవీటి కాంతమ్మ, కిజర్‌ఖాన్, అర్షద్ అలి, రాఘువేంద్ర, కాళిదాసు, భారతి, నాయకులు, సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాకే మీ ముందుకు వస్తాం



సజ్జలపల్లిలో సంక్షేమ లబ్ధి బావుటా అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్: కుప్పం నియోజకవర్గంలో అన్ని సమస్యలను పరిష్కరించిన తరువాతే ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వస్తామని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎస్.కొత్తపల్లి పంచాయతీలో సజ్జలపల్లి, కుంజేగానూరు, నిమ్మకంపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ మూడు గ్రామాల్లో 260 కుటుంబాల వద్దకు వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మూడేళ్ల కాలంలో వారికి చేకూరిన లబ్ధి గురించి వివరించి సంక్షేమ బావుటా పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్సీ దృష్టికి పలు సమస్యలు విన్నవించారు. రోడ్లు, రేషన్‌కార్డులు, పెన్షన్లు, అమ్మఒడి అందలేదని చెప్పగా, వెంటనే ఆయన అక్కడే ఉన్న అధికారులతో చర్చించి పరిష్కారం చూపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 35 ఏళ్లుగా కుప్పం ప్రజలతో ఓట్లు వేయించుకుంటున్న వ్యక్తి హైదరాబాద్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే కుప్పం ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఉన్నతాధికారుల చేతుల్లో ఉన్నవాటిని వారితోనే మాట్లాడి పరిష్కరిస్తున్నామన్నారు. అభివృద్ధి పథకాలైతే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో సీఎంతో చర్చించి తెచ్చుకుంటున్నామని తెలిపారు. కుప్పం మున్సిపాలిటీకి రూ.66 కోట్లు, గ్రామాల్లో రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. 14 ఏళ్లు బాబు ముఖ్యమంత్రిగా ఉండి కుప్పం ప్రజలకు ఏమి చేశారని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, ఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ శరవణ, నాయకులు మురుగేష్, ఈశ్వర్, గోవిందన్, శీను, రామచంద్రప్ప, రాజా, కదిరివేలు, ఉన్నారు.

కుష్టువ్యాధి నివారణపై అవగాహన

పుంగనూరు: కుష్టువ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీపీఎంఓ దేవదాసు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని ఈడిగపల్లె హైస్కూల్ విద్యార్థులతో కలిసి కుష్టువ్యాధి నివారణ వారోత్సవాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించి, నివారణ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. వ్యాధిగ్రస్తుల పట్ల ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఏఎన్‌ఎం భారతి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి ఇంటి నిర్మాణాలు పూర్తి చేయండి



జగనన్న కాలనీలో పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి



సోమలలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగరాజ

పుంగనూరు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో ఉగాది పండుగకు గృహప్రవేశాలు చేసేలా నిర్మాణ పనులు వేగవంతం చేసినట్లు కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఉదయం 6 గంటలకు జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ హరినారాయణ్ ఆదేశాల మేరకు ప్రతి రోజు ఉదయం ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షిస్తూ లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 1,525 గృహాలు మంజూరు కాగా, 448 ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన గృహాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. అలాగే 1536 టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసి, గృహప్రవేశాలకు సిద్ధం చేశామన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు లబ్ధిదారులకు నిర్మాణాలకు అవసరమైన సామగ్రి అందిస్తూ ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. కాలనీల్లో రోడ్లు, పైపులైన్లు, విద్యుత్‌లైన్లు, మురుగునీటి కాలువలు నిర్మాణాలు వేగవంతం చేశామని, ఉగాదికి సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ హేమంత్ పాల్గొన్నారు.

ఉగాదికి గృహప్రవేశాలు

సోమల: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న కాలనీల్లో ఉగాది నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంపీడీఓ నాగరాజ ఆదేశించారు. శుక్రవారం కలికిరి రోడ్డులోని జగనన్న లేవుట్–2ను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ లబ్ధిదారులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తున్నా, నిర్మాణాలు చేపట్టడానికి ఆలస్యం ఎందుకు అవుతోందో చెప్పాలని కోరారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జావీద్ అలీ, వీఆర్‌ఓ శ్రీజ, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు షారుక్, మణికంఠ పాల్గొన్నారు.

ఉపాధిలో తేలని లెక్క రూ.41 వేలు

- మస్టర్లను సక్రమంగా నిర్వహించని మేట్లే కారణం
- పలమనేరు ఏపీఓ పుష్పలత

పలమనేరు: పలమనేరు మండలానికి సంబంధించి గతేడాది చేపట్టిన ఉపాధిహామీ పనుల్లో రూ.41 వేలు లెక్కతేలని అభియోగ రుసుముగా తేలిందని పలమనేరు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ పుష్పలత తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆమె 16వ విడత సామాజిక తనిఖీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలంలోని పది పంచాయతీల్లో గతేడాది రూ.3.19 కోట్లతో ఫాంపాండ్, ఫిష్‌పాండ్, క్యాటిల్ పాండ్, మామిడి మొక్కల పెంపకం లాంటి పనులు జరిగాయన్నారు. ఇందుకు సంబంధించిన సోషల్ ఆడిట్ విచారణలో రూ.41 వేల దాకా లెక్కలు తేలలేదన్నారు. దీనిపై జిల్లా అధికారులు రికార్డులను తనిఖీ చేయగా పది పంచాయతీల్లోనూ మేట్‌లు మస్టర్లను సక్రకంగా నిర్వహించనందున తేడాలొచ్చినట్టు నిర్ధారించారన్నారు. ఇక అవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించి మొత్తం 3,341 మొక్కలను నాటగా వాటిల్లో 731 మొక్కలు చనిపోయినట్టు తేలిందన్నారు. వీటిని మళ్లీ నాటించనున్నట్టు తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత పవర్ హిట్టర్స్



విజేతలకు ట్రోఫీని అందిస్తున్న నాయకులు

శాంతిపురం: దివంగత వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ చంద్రమౌళి మెమోరియల్ క్రికెట్ టోర్నీ విజేతగా పవర్‌హిట్టర్స్ జట్టు నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చౌడంపల్లి కేకేఆర్ బాయ్స్ జట్టుపై పవర్ హిట్టర్స్ జట్టు గెలుపొంది రూ.75 వేల నగదు, ట్రోఫీని అందుకుంది. టోర్నీలో మొత్తం 54 జట్లు పాల్గొన్నాయి. అలాగే టోర్నీ రన్నర్స్‌గా నిలిచిన కేకేఆర్ బాయ్స్ రన్నర్ ట్రోఫీతో పాటు రూ.50 వేల నగదు, మూడో బహుమతిగా రూ.30 వేల నగదు రాళ్లబూదుగూరుకు చెందిన బుజ్జి–11 జట్టు కైవశం చేసుకుంది. స్థానిక టైలర్ స్కూల్ గ్రౌండ్‌లో జరిగిన బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులను అందించారు. టోర్నీని సమర్థవంతంగా నిర్వహించిన నిర్వాహకులు సునీల్, మణి, దండికుప్పం కుమార్‌ను అభినందించారు. ఎంపీపీ వసుంధర, శాంతిపురం, రామకుప్పం జెడ్పీటీసీ సభ్యులు శ్రీనివాసులు, నితిన్, నాయకులు బుల్లెట్ దండపాణి, విజయకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే ఆర్యవైశ్యులకు పెద్దపీట



మాట్లాడుతున్న మువ్వల నరసింహులు శెట్టి

పులిచెర్ల(కల్లూరు): ఆర్యవైశ్యులకు వైఎస్సార్‌సీపీలోనే పెద్దపీట వేయడం జరిగిందని కాణిపాక ఆలయ పాలకమండలి సభ్యులు మువ్వల నరసింహులు శెట్టి తెలిపారు. కల్లూరులో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నారా లోకేష్ పలమనేరు పాదయాత్రలో ఆర్యవైశ్యులకు వైఎస్సార్‌సీపీలో తగిన గుర్తింపు లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ పాలనలో ఆర్యవైశ్యులకు ఎక్కడా గుర్తింపు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టరు ఎస్ఎస్‌రెడ్డి ప్రకాష్, చంద్రశేఖరరెడ్డి, విజయకుమార్, వంశీ, ప్రతాప్, మహేష్ పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై ఆది దంపతులు



పలమనేరు: పట్టణంలోని శివాలయంలో జరుగుతున్న కాశీవిశ్వేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారు అశ్వ వాహనంపై నుంచి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయం వద్ద ఉదయం అభిషేకాలు, మధ్యాహ్నం గ్రామోత్సవం జరిగాయి. ఇందులో పలువురు భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో గిరిజాకల్యాణం నిర్వహించనున్నట్టు ఈఓ తెలిపారు.